స్పీడ్ తగ్గిన గెలాక్సీ బస్సులు


మార్కాపురం టూ ఒంగోలు గెలాక్సీ సర్వీసు


చీమకుర్తి వద్ద గుంతలు

- రోజూ తొలి ప్రయాణికుడే బస్సు క్లీనర్
- ఆదరణ కోల్పోతున్న ఒంగోలు సర్వీసులు
- ఒంగోలు వెళ్లాలంటే సుమారు 3 గంటల సమయం
- చీమకుర్తి వద్ద రోడ్డు మరీ అధ్వానం

మార్కాపురం: జిల్లా కేంద్రం ఒంగోలు వెళ్లేందుకు మార్కాపురం నుంచి తిరిగే గెలాక్సీ సర్వీసులు ప్రయాణికుల ఆదరణ కోల్పోతున్నాయి. ప్రారంభించిన కొత్తలో గెలాక్సీ సర్వీసుల్లో ఎక్కేందుకు ప్రయాణికులు ఉత్సాహం చూపించారు. అప్పట్లో 2.10 గంటల్లో మార్కాపురం నుంచి ఒంగోలుకు బస్సు వెళ్లేది. ప్రస్తుతం ఈ బస్సులు 2.45 గంటల నుంచి 3 గంటల సమయం తీసుకుంటున్నాయి. బస్సులు తరుచూ మరమ్మతులకు గురికావటం.. కొత్త సర్వీసులు వేయక పోవడంతో ప్రయాణికులు వేగంగా వెళ్లే అద్దంకి, కర్నూలు, వెంకటగిరి డిపోల బస్సులపై మొగ్గు చూపుతున్నారు. మార్కాపురం డిపోలో ఉదయం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు సుమారు 15 సింగిల్స్ ఒంగోలుకు రాకపోకలు సాగిస్తుంటాయి. జిల్లా కేంద్రం కావడంతో పాటు పుల్లలచెరువు, యర్రగొండపాలెం, పెద్దారవీడు, పెద్దదోర్నాల, త్రిపురాంతకం, కొనకనమిట్ల, తర్లుపాడు తదితర మండలాల నుంచి వేలాది మంది ప్రజలు ఒంగోలుకు వెళ్లాలంటే మార్కాపురం వచ్చి ఎక్స్‌ప్రెస్ సర్వీసులను ఆశ్రయిస్తున్నారు. నిత్యం వివిధ పనులపై ఒంగోలు వెళ్లే అవసరం ఈ ప్రాంత ప్రజలకు ఉంటుంది. ప్రభుత్వ కార్యాలయాలు, వైద్యశాలలు, శుభకార్యాల్లో పాల్గొనేందుకు రోజుకు దాదాపు అన్ని బస్సుల్లో కలిపి 10 నుంచి 12 వేల మంది వరకు రాకపోకలు సాగిస్తుంటారు. మారుతున్న పరిస్థితుల్లో ప్రయాణికులు వేగంగా వెళ్లే బస్సులను ఎక్కేందుకు ఇష్టపడుతున్నారు. ఇతర డిపోల బస్సులు 2.15 గంటలకు ఒంగోలుకు ప్రయాణికులను చేరుస్తుండగా మార్కాపురం డిపో నుంచి బయల్దేరే ఎక్స్‌ప్రెస్ బస్సులు ప్రయాణికుల సహనాన్ని పరీక్షిస్తున్నాయి. దీంతో ఆదరణ కొల్పోతున్నాయి. పొదిలి నుంచి చీమకుర్తి వరకూ రహదారి గుంతలుపడి అధ్వానంగా మారి రోడ్డు సరిగా లేకపోవటం, గెలాక్సీ సర్వీసులకు కొనకనమిట్లలో స్టాపింగ్ ఇవ్వడంతో ఆలస్యం అవుతోందని పలువురు డ్రైవర్లు పేర్కొంటున్నారు.

పరిశుభ్రత నిల్


మార్కాపురం డిపో బస్సుల్లో ఉదయం పూట బస్టాండ్‌కు వచ్చి బస్సు ఎక్కే తొలి ప్రయాణికుడే క్లీనర్‌గా మారాల్సి వస్తోంది. డిపో నుంచి బయటకు వచ్చే బస్సులను శుభ్రం చేసి పంపించాల్సి ఉండగా కటి, రెండు బస్సులను మాత్రమే శుభ్రం చేసి బయటకు పంపుతున్నారు. దీంతో బస్సు ఎక్కిన ప్రయాణికులు సీట్లలో కూర్చునే ముందు తమ కర్చీఫ్‌లతో శుభ్రం చేసుకుని కూర్చోవాల్సి వస్తోంది. ఈ విషయాన్ని పలుమార్లు ఆర్టీసీ అధికారులకు తెలిపినా ఒకటి, రెండు రోజులు మినహా పరిస్థితుల్లో మార్పు ఉండటం లేదు. ఈ నేపథ్యంలో ప్రయాణికులు ఇతర డిపోల బస్సుల్లో ప్రయాణించేందుకు ఇష్టపడుతుండటంతో మార్కాపురం డిపోకు వచ్చే ఆదాయం తగ్గిపోతోంది.


బస్సు సీటులో చేరిన వర్షపు నీటి చుక్కలు

క్లుప్తంగా

మార్కాపురానికి ఇద్దరు ఎస్సైల నియామకం


టూటౌన్ ఎస్సై రాజమోహన్‌రావు


ట్రాఫిక్ ఎస్సై అహరోన్

మార్కాపురం: పట్టణ పరిధిలో ఇద్దరు ఎస్సైలను నియమిస్తూ ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. టూటౌన్ ఎస్సైగా రాజమోహన్‌రావు, ట్రాఫిక్ ఎస్సైగా అహరోన్‌ను నియమించారు. పట్టణ త్రీటీ ఎస్సైగా విధులు నిర్వహించిన రాజమోహన్‌రావుకే టూటౌన్ ఎస్సైగా బాధ్యతలు అప్పగించారు. గతంలో మార్కాపురం పట్టణ పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా, హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తించిన అహరోన్ ట్రాఫిక్ ఎస్సైగా నియమితులయ్యారు.

ఎరువుల దుకాణాల ఆకస్మిక తనిఖీ


ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏవో విజయభాస్కర్‌రెడ్డి

గిద్దలూరు రూరల్: పట్టణంలోని ఎరువులు, విత్తనాల దుకాణాలను స్థానిక వ్యవసాయశాఖ అధికారి విజయభాస్కర్‌రెడ్డి శనివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్, బిల్లు పుస్తకాలు, ఇన్‌వాయిస్‌లు, లైసెన్సులు, గోడౌన్‌లను పరిశీలించారు. రైతులకు విక్రయించే ప్రతి వస్తువు పై కచ్చితంగా బిల్లు ఇవ్వాలని సూచించారు. కొత్తస్టాక్ వచ్చిన సమయంలో వ్యవసాయశాఖ అధికారులకు సమాచారం అందించాలన్నారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన యూటీఎఫ్ మండల నూతన కమిటీ నాయకులు

బేస్తవారిపేట: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ హాలులో యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభల సందర్భంగా మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వీరారెడ్డి, ప్రధాన కార్యదర్శి వీరాంజనేయులు ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. యూటీఎఫ్ మండల గౌరవ అధ్యక్షునిగా ఎస్ మధుసూదన్‌రెడ్డి, అధ్యక్షునిగా ఎస్ లక్ష్మీరెడ్డి, ఉపాధ్యక్షులుగా పీవీ రాజశేఖర్, బీ సుభద్రాదేవి, ప్రధాన కార్యదర్శిగా డీ ఖాశీంవలి, కోశాధికారి జీ శ్రీనివాసరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ సత్యనారాయణరెడ్డి, జిల్లా కార్యదర్శులు రమణారెడ్డి, ఐవీ రామిరెడ్డి, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ఉప్పర సంఘం నూతన కమిటీ ఎన్నిక


నూతనంగా ఎన్నికైన కమిటీ

గిద్దలూరు రూరల్: భగీరథ సగర ఉప్పర సంఘం గిద్దలూరు, రాచర్ల, కొమరోలు మూడు మండలాల నూతన కమిటీ ఎన్నిక స్థానిక ఉప్పర సేవా సంఘం కార్యాలయంలో శనివారం నిర్వహించారు. అధ్యక్షుడిగా దండూరి సోమయ్య, ఉపాధ్యక్షుడిగా మద్దిలేటి, గౌరవ అధ్యక్షుడిగా మజ్జారి రాములు, ప్రధాన కార్యదర్శిగా జూటూరి చిన్నసుబ్బారాయుడు, సహాయ కార్యదర్శులుగా దండెబోయిన రమణ, కొప్పుల పెద్దనరసింహులు, కె.వెంకటస్వామి, కోశాధికారిగా మూర్తయ్య, గౌరవ సలహాదారులుగా వెంకటేశ్వర్లును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడు సోమయ్య మాట్లాడుతూ సగర ఉప్పర సంఘం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

రైతులు ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి


రైతులకు శనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సారె వెంకట నాయుడు

కొమరోలు: రైతులు ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని జెడ్పీటీసీ సారె వెంకట నాయుడు తెలిపారు. కొమరోలులోని రైతు భరోసా కేంద్రంలో ప్రభుత్వం రైతులకు ఇచ్చే రాయితీ శనగ విత్తనాలను శనివారం జెడ్పీటీసీ వెంకటనాయుడు రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైతు భరోసా కేంద్రం ఉద్యోగులు, రైతులు పాల్గొన్నారు.

వెలుగొండకు రూ.2 వేల కోట్లు కేటాయించాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ డిమాండ్
- రేపు తహసీల్దార్‌కు వినతిపత్రాల అందజేత


మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ

మార్కాపురం: వెలుగొండ ప్రాజెక్టుకు తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం 2 వేల కోట్ల రూపాయలు కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక పూలసుబ్బయ్య శాంతి భవన్‌లో సీపీఐ కార్యాకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ పశ్చిమ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ అయిన పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణ పనులకు, ముంపు గ్రామాల బాధితులకు తక్షణమే రూ.2 వేల కోట్ల నిధులు ఇవ్వాలని కోరుతూ ఈ నెల 28న ప్రాజెక్టు పరిధిలోని అన్నీ మండలాల తహశీల్దార్ కార్యాలయాల్లో వినతి పత్రాలు ఇవ్వాలని పార్టీ కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. ముంపు గ్రామాల బాధితులకు నేటికీ ఆర్‌ఆర్ ప్యాకెజీ మంజూరు చేయలేదన్నారు. ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి 28 ఏళ్లు దాటుతున్నా పూర్తి కాకపోవడం శోచనీయమన్నారు. 7 దశాబ్దాల నుంచి పశ్చిమ ప్రాంతం పాలకుల నిర్లక్ష్యానికి, నిరాదరణకు గురైందన్నారు. కరువు పోవాలంటే వెలుగొండ ప్రాజెక్టు ఒక్కటే శరణ్యమన్నారు. వెలుగొండ నీటితో ఫ్లోరైడ్ నీటికి చెక్ పెట్టవచ్చని పేర్కొన్నారు. ఇటీవల సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యంలోని బృందం నీటి పారుదల శాఖ మంత్రిని కలిసి వివరించిందన్నారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి అందె నాసరయ్య మాట్లాడుతూ వెలుగొండపై తమ పార్టీ రాజీలేని పోరాటం చేస్తోందన్నారు. ఎస్‌కె ఖాశీం, పెద్దన్న పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు రాజుపాలెం విద్యార్థిని


ఎంపికైన విద్యార్థితో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

కొమరోలు: మండలంలోని రాజుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న 8వ తరగతి విద్యార్థిని షేక్ సమ్రీన్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికై నట్లు ప్రధానోపాధ్యాయుడు జి.వి.చంద్రశేఖర్ తెలిపారు. కందుకూరులోని టీఆర్‌ఆర్ జూనియర్, డిగ్రీ కళాశాలలో జిల్లా స్థాయి 14, 17 అథ్లెటిక్స్‌లో బాలికలకు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో హైజంప్ విభాగంలో షేక్ సమ్రీన్ ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. శ్రీకాకుళంలో త్వరలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు సమ్రీన్ ఎంపిక కావడంతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించారు.


కొమరోలు : విద్యార్థిని సమ్రీన్‌కు మిఠాయి తినిపిస్తున్న ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు చిరంజీవి

మార్కాపురం టౌన్: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి చిరంజీవి రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం ఎం.చంద్రశేఖర్‌రెడ్డి శనివారం తెలిపారు. ఈ నెల 25న కందుకూరు టీఆర్‌ఆర్ కళాశాల గ్రౌండ్‌లో జరిగిన అండర్–17 బాలుర అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొన్న చిరంజీవి 110 మీటర్ల హార్డిల్స్‌లో కూడా జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా చిరంజీవిని తీర్చిదిద్దిన ఫిజికల్ డైరెక్టర్ జాహ్నవి ప్రియ, చెన్నకృష్ణ, ఉపాధ్యాయలు రమేష్, కొండయ్య, సమీవుల్లా అభినందించారు.

ఆలయాల్లో భక్తుల సందడి


అలంకరణలో శ్రీవారి ఉత్సవమూర్తులు

కొనకనమిట్ల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెలుగొండ వెంకటేశ్వరస్వామి ఆలయం, రేగడపల్లి వెంకటేశ్వర స్వామి, కొనకనమిట్ల రామదూతక్షేత్రంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. నమో వేంకటేశాయ నమోనమః అంటూ భక్తులు స్వామివారిని దర్శించుకుని పరవశించారు. ఆలయ అర్చకులు తిరుమలాచార్యులు శ్రీలక్ష్మీ అలివేలుమంగా వెలుగొండ వెంకటేశ్వరస్వామి వార్లను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామం వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో గోవిందా.. గోవిందా అంటూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు అర్చనలు, అభిషేకాలు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు విజయకాంత్‌శర్మ భూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వరస్వామిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు.

నీటికుంటను అభివృద్ధి చేసిన ప్రజాసంకల్ప వేదిక


నీటి కుంటను అభివృద్ధి చేస్తున్న ప్రజా సంకల్ప వేదిక నిర్వాహకులు

గిద్దలూరు రూరల్: మండలంలోని కొంగలవీడు గ్రామ సమీపంలో చిల్లచెట్లతో నిండిపోయిన నీటి కుంటను ప్రజా సంకల్ప వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మదిరె రంగసాయిరెడ్డి శనివారం తన సొంత ఖర్చులతో అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ సందర్భంగా రంగసాయిరెడ్డి మాట్లాడుతూ ఓటుకు నోటు ఇచ్చి అధికారంలోకి వచ్చిన నాయకులు గిద్దలూరు అభివృద్ధిని విస్మరించారని అన్నారు. నీటి కుంటలో చిల్ల చెట్లను తొలగించడం వల్ల పశువులకు నీరు తాగేందుకు వీలు ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి లక్ష్మీప్రియ, వైఎస్సార్‌సీపీ నాయకులు భూపాల్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

12వ రోజుకు చేరిన రిలే దీక్షలు

మార్కాపురం టౌన్: మున్సిపల్ కార్యాలయంలో కాంట్రాక్టు ఉద్యోగులను అక్రమంగా తొలగించడాన్ని నిరసిస్తూ చేస్తున్న దీక్ష శనివారంతో 12వ రోజుకు చేరింది. మున్సిపల్ కార్మికులను తొలగింపు విషయంలో కార్మిక చట్టాలు, నియమ నిబంధనలు పాటించకుండా తొలగించడం అన్యాయమని, సుమారు 20 ఏళ్లుగా బోర్ ఆపరేటర్స్, పైప్‌లైన్ ఫిట్టర్స్, వర్క్ ఇన్‌స్పెక్టర్లుగా వివిధ విభాగాల్లో పని చేస్తున్న కార్మికులను తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ, మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల యూనియన్ నాయకులు సుబ్బరాయుడు, హరి, ఇమాంసా, సుబ్బారెడ్డి, కనకయ్య, అబ్దుల్ సలాం, శ్రీను పాల్గొన్నారు.

200 మంది విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు

కొమరోలు: స్థానిక ఎస్‌బీఎస్‌ఆర్‌ఎం ఎయిడెడ్ పాఠశాలలో 200 మంది విద్యార్థులకు కంటి వైద్యనిపుణుడు సుదర్శన్‌రెడ్డి వైద్యపరీక్షలు శనివారం నిర్వహించారు. పాఠశాలలో 8, 9, 10 తరగతులు చదువుతున్న బాలబాలికలకు కంటి పరీక్షలు నిర్వహించి దూరదృష్టి లోపం కలిగిన వారిని గుర్తించారు. సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో 35 మంది విద్యార్థులకు దూరదృష్టి లోపమున్నట్లు గుర్తించామని, వీరికి ప్రభుత్వం త్వరలో కళ్లద్దాలు అందజేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం ఆర్నాల్డ్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు అవగాహన

కంభం: హైదరాబాద్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు మనవడు ప్రముఖ మానసిక తత్వవేత్త రాధాకృష్ణారావు స్థానిక ఎస్‌వీకేపీ డిగ్రీ కళాశాలలో వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలంటే పండుగలని బద్ధకం, సోమరితనం, అశ్రద్ధలను వదిలి క్రమశిక్షణతో, పట్టుదలతో చదివితే సత్ఫలితాలు సాధించవచ్చన్నారు. తరగతి గదులను తరగతి గనులుగా భావించాలన్నారు. మానసిక ఒత్తిడిని జయించాలంటే వాటి నుంచి తప్పించుకోవద్దని, తట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ గోళ్ల సుబ్బరత్నం, ప్రిన్సిపాల్ లు కూనా రాము, వెంకటరెడ్డి, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్యూచర్ ఆన్ సైన్స్ పోటీల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

కొనకనమిట్ల: ఇటీవల చీమకుర్తిలో జరిగిన జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ పోటీల్లో మండలంలోని వెలుగొండ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు పలువురు మంచి ప్రతిభ కనబరిచి జోనల్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు దేవబెరంజిన్ జియోబోర్డులో ప్రథమ స్థానంలో నిలవగా క్లైనో మీటర్‌కు కె.నరేంద్ర ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. ఇద్దరు విద్యార్థులు 28, 29 తేదీల్లో కొండపిలో నిర్వహించే జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. విద్యార్థులను, గణిత ఉపాధ్యాయుడిని ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు గొట్లగట్టు విద్యార్థుల ఎంపిక


క్రీడాకారులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

కొనకనమిట్ల: వైఎస్సార్ కడప జిల్లా రాయచోటిలో ఈ నెల 27వ తేదీన నిర్వహించే అండర్–17 రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనేందకు మండలంలోని గొట్లగట్టు జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడాకారులు ఇద్దరు ఎంపికయ్యారని పాఠశాల హెచ్‌ఎం విజయలక్ష్మి, పీడీ వై.బాలగురవయ్య తెలిపారు. ఈ సందర్భంగా పీడీ బాలగువయ్య మాట్లాడుతూ పాఠశాలకు చెందిన డి.ఉమాశంకర్ (బాలుర విభాగం), చందలూరి మహేశ్వరి (బాలికల విభాగం)లో ఇటీవల ఒంగోలులో నిర్వహించిన జిలా స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన క్రీడాకారులను శనివారం పాఠశాలలో హెచ్‌ఎం విజయలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. జిల్లా, రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థులు ఎంపిక అయ్యేందుకు మంచి తర్ఫీదు ఇచ్చిన పాఠశాల పీడీ బాలగురవయ్యను, ఎంపికైన క్రీడాకారులను పాఠశాల హెచ్‌ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు. జాతీయ స్థాయిలో కూడా తమ పాఠశాల క్రీడాకారులు విజయం సాధించాలని ఆకాంక్షించారు.


విద్యుత్ కాంతులతో తర్లుపాడు జెడ్పీ పాఠశాల

నేడు తర్లుపాడు జెడ్పీ పాఠశాల వజ్రోత్సవం

- పూర్వ విద్యార్థులు రూ.52 లక్షల చందాలతో పాఠశాల అభివృద్ధి
- హాజరు కానున్న 4 వేల మందికిపైగా పూర్వ విద్యార్థులు

తర్లుపాడు: స్థానిక జెడ్పీ పాఠశాల ఆదివారం వజ్రోత్సవానికి ముస్తాబైంది. 1949లో బోర్డు హైస్కూల్‌గా 4వ ఫారంతో మొదలైన పాఠశాల ప్రస్థానం దినదిన ప్రవర్ధమానమై ఎందరికో విద్యా వెలుగులు పంచి 75 వసంతాల సంబరాలకు సిద్ధమైంది. సరైన విద్యా సౌకర్యాలు లేని రోజుల్లో విద్యనందించి, తమ జీవితాల్లో వెలుగులు నింపేందుకు తోడ్పడిన పాఠశాలకు పూర్వ విద్యార్థులు రూ.52 లక్షలకు పైగా చందాలు అందజేసి తమ రుణాన్ని చాటారు. మరెందరో విద్యార్థుల భవిష్యత్ తీర్చిదిద్దేందుకు పాఠశాలలో మెరుగైన వసతుల కల్పన కోసం తమ దాతృత్వాన్ని, మమకారాన్ని చాటారు.

విద్యార్థుల ఆర్థిక సాయంతో అభివృద్ధి పనులు

పూర్వ విద్యార్థులు 52 లక్షల రూపాయల చందాలతో పాఠశాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా వజ్రోత్సవ స్థూపం, విద్యావనం, డైనింగ్ టేబుల్స్, ముఖద్వారం నిర్మాణం, కాంక్రీట్ రోడ్డు నిర్మాణం, గ్రౌండ్ లెవలింగ్ పెయింటింగ్, సుందరీకరణ, కాంపౌండ్ వాల్ ఎత్తు పెంపు, ఫెన్సింగ్, పైప్ లైన్, వాటర్ ట్యాంకర్‌ను ఏర్పాటు చేశారు.

హాజరు కానున్న పూర్వ విద్యార్థులు

ఆదివారం ఉదయం తర్లుపాడులో భారీ జాతీయ పతాకంతో పురవీధుల్లో ర్యాలీతో కార్యక్రమం ప్రారంభం కానుంది. దేశ, విదేశాల్లో వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు తమ కుటుంబ సభ్యులతో కలిసి సుమారు 4 వేల మందికి పైగా కార్యక్రమానికి హాజరు కానున్నారు. దీనికితోడు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు కార్యక్రమానికి హాజరై అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించనున్నారు. పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు, శ్రేయోభిలాషులు, గ్రామస్తులు హాజరై ఘనంగా నిర్వహిస్తున్న వజ్రోత్సవాన్ని జయప్రదం చేయాలని పాఠశాల హెచ్‌ఎం సుధాకర్ కోరారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు, వీఐపీల కోసం ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

జాతీయ లోక్ అదాలత్‌పై అవగాహన

గిద్దలూరు రూరల్: జాతీయ లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఏ.ఓంకార్ అన్నారు. డిసెంబర్ 14న నిర్వహించబోయే లోక్‌అదాలత్‌పై స్థానిక కోర్టు భవనంలో పోలీసులకు శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కక్షిదారులను లోక్‌అదాలత్ ద్వారా కేసులను రాజీ చేసుకునేలా చూడాలన్నారు. రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించుకోవడం వల్ల వారికి కలిగే ప్రయోజనాలను వివరించాలన్నారు. ఈ సందర్భంగా జాతీయ లోక్ అదాలత్ పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి.మేరిసారాధానమ్మ, సీఐలు కె.సురేష్, మల్లికార్జున, బేస్తవారిపేట ఎస్సై రవీంద్రారెడ్డి, రాచర్ల ఎస్సై కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్లను విడుదల చేస్తున్న జడ్జిలు

బీసీ బాలికల వసతి గృహం తనిఖీ

ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఏ.ఓంకార్ పట్టణంలోని బీసీ బాలికల వసతి గృహాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. వసతి గృహంలో విద్యార్థులకు కల్పిస్తున్న వసతుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

రోడ్డుకు అడ్డంగా కేబుల్ వైరు

- వాహనదారులకు ఇబ్బందులు

కొనకనమిట్ల: మండల కేంద్రం కొనకనమిట్ల బస్టాండ్‌కు సమీపంలోని పాత పోలీస్‌స్టేషన్, పోలేరమ్మ ఆలయం ఎదురుగా జాతీయ రహదారిపై కేబుల్ వైరు రోడ్డుకు అడ్డంగా పడి ఉండటంతో వాహనాదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఏదో కంపెనీకి చెందిన కేబుల్ వైరును రోడ్డుకు అటు ఇటూ కర్రల సాయంతో ఏర్పాటు చేశారు. నాలుగు రోజులుగా కర్రలు పడి పోవడంతో కేబుల్ వైరు రహదారికి అడ్డంగా పడింది. వాహనాలు వైరును తొక్కుకుంటూనే వెళ్తున్నాయి. కొందరు వాహనదారులు స్పీడుగా వస్తూ దగ్గరికి వచ్చే సరికి రోడ్డుకు వైరు అడ్డంగా పడి ఉండటం చూసి సడన్‌గా బ్రేక్ వేయడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, సంబంధిత కేబుల్ వైరు నిర్వాహకులు స్పందించి రోడ్డుకు అడ్డంగా పడి ఉన్న కేబుల్ వైరును తొలగించాలని స్థానికులతో పాటు వాహనదారులు కోరుతున్నారు.


జాతీయ రహదారికి అడ్డంగా కేబుల్ వైరు

పేదలకు సాయం చేయడమే స్వచ్ఛంద సంస్థ ఉద్దేశం

పొదిలి రూరల్: పేద ప్రజలకు సాయం చేయడమే హబీబుల్లా బేగ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఉద్దేశమని ఆ సంస్థ చైర్మన్ కరిముల్లా బేగ్ అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిరుపేద ప్రజలకు వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాభావంతో పేద ప్రజలు, యాచకులు ఇబ్బంది పడకుండా వారి స్థితిగతులను గమనించి గొడుగులు, చాపలు, ప్లాస్టిక్ బాక్సులు పంపిణీ చేశారు. ఆపదలో ఉన్న వారికి తమ స్వచ్ఛంద సంస్థ తరపున ఎంతో సాయం చేశామన్నారు. ఎంఈఓ ఎం. శ్రీనివాసులు, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు కె.యలమందారెడ్డి, బండి అశోక్, బీవీరెడ్డి, బాలురు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కరిమున్‌బీ, అడ్వకేట్ షబ్బీర్ పాల్గొన్నారు.


పేదలకు వస్తువులు అందజేస్తున్న నిర్వాహకులు

పంచారామాలకు ప్రత్యేక బస్సులు

గిద్దలూరు రూరల్: పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ బి.చంద్రశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్తీక మాసం సందర్భంగా నవంబర్ 4, 11, 18, 25 వ తేదీల్లో భక్తుల సౌకర్యార్థం అమరావతి, సోమారామం, క్షీరారామం, ద్రాక్షారామం, కుమారారామం పంచక్షేత్రాలను ఒకే రోజు దర్శించుకుని వచ్చేందుకు ప్రతి ఆదివారం ప్రత్యేకబస్సు సర్వీసు నడపనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 9959225702 సెల్ నంబర్‌ను సంప్రదించాల్సిందిగా కోరారు.